మాక్ టెస్ట్‌ను పరిశీలించిన ఏఎంవో

స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 10 : నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే-2024లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మాక్ టెస్ట్‌ను అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ పరిశీలించారు. మండల పరిధిలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించగా విద్యార్థులు పరీక్ష రాశారు. నవంబర్‌లో జరిగే పరీక్షలో జిల్లాలోనే స్టేషన్‌ఘన్‌పూర్ విద్యార్థులు ప్రథమ స్థానంలో ఉండేలా శిక్షణ ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి కొమురయ్య, కాంప్లెక్స్ హెచ్ఎం సంపత్, యూపీఎస్ హెచ్ఎం సదామోహన్, ఎమ్మార్సీ సిబ్బంది గిరి, జ్యోతి, రమేశ్ పాల్గొన్నారు.

వినాయకుల నిమజ్జనానికి స్థల పరిశీలన

నిమజ్జనానికి స్థల పరిశీలన చేస్తున్న ఏసీపీ

స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 10 : నవరాత్రుల అనంతరం వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం ఏసీపీ భీంశర్మ మంగళవారం స్థల పరిశీలన చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ శివారు పుట్టలమ్మ కుంటలో నిమజ్జనానికి సీఐ వేణుతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. నిమజ్జనానికి ఆటంకాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఏసీపీ సూచించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 10 : మండలంలోని తాటికొండలో అక్కనపల్లి యాదయ్య అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మాజీ వైస్ ఎంపీపీ సుధీర్‌రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న మహ్మద్ సాబీర్‌సాబ్‌ను పరామర్శించి 50 కిలోల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బేతి రామచంద్రారెడ్డి, గ్రామ అధ్యక్షుడు ఎడమ కట్టమల్లు, మేకల మల్లేశం పాల్గొన్నారు.

ఐలమ్మ భూ పోరాటం గొప్పది

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

పాలకుర్తి రూరల్, సెప్టెంబర్ 10: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ భూ పోరాటం గొప్పదని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని వీరనారి కాంస్య విగ్రహానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమండ్ల ఝాన్సీరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డితో కలిసి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. యశస్వినీరెడ్డి మాట్లాడుతూ ఐలమ్మ జయంతిని, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఐలమ్మ, షేక్ బందగీ, దొడ్డి కొమురయ్య, ఠానూనాయక్, దర్గ్యా నాయక్ వంటి ఉద్యమకారులు పాలకుర్తి నియోజకవర్గంలో జన్మించడం మన అదృష్టమన్నారు. ఓ వైపు పోరాట యోధులను, మరో వైపు మహా కవులను కన్న పాలకుర్తికి తాను ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించడం అదృష్టమన్నారు. ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్లను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఐలమ్మ వర్ధంతి వేడుకలు

ఐలమ్మ వర్ధంతిని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ పి శ్రీనివాస్, ఆర్ఐ రాకేశ్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఆవుల రాములు, సూపరింటెండెంట్ రవీందర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐలమ్మ మనుమడు, మాజీ సర్పంచ్ చిట్యాల రామచంద్రం, వారసులు సంపత్, శ్వేత, రాపర్తి మంజుల, రాణి, చిట్యాల యాకయ్య, చక్రాల రఘు, సీపీఎం నాయకులు మాచర్ల సారయ్య, సింగారపు రమేశ్, చిట్యాల సోమన్న, బ్లాక్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, తాజా మాజీ ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ బొబ్బల ఆశోక్‌రెడ్డి, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి గుమ్మడి రాజుల సాంబయ్య, ఉల్లెంగుల యాదగిరి, ఎదూనూరి మదార్ పాల్గొన్నారు.

పాలకుర్తిలో ఐలమ్మ కాంస్య విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

ఐలమ్మ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి రూరల్ : చాకలి ఐలమ్మ భూ పోరాటం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆమె వర్ధంతిని పురస్కరించుకుని హనుమకొండలోని తన నివాసంలో ఐలమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రజాకార్లను ఎదురించిన ధీశాలి, విస్నూరు దేశ్ ముఖ్ ఆగడాలను అడ్డుకున వీరవనిత ఐలమ్మ అన్నారు. ఓ వైపు సాయుధ పోరాటం చేస్తూనే మరో వైపు కమ్యూనిస్టు ఉద్యమకారులకు అన్నం పెట్టి కాపాడిన మహనీయురాలన్నారు.

పాఠశాల అభివృద్ధికి చేయూత అభినందనీయం : డీఈవో రాము

బచ్చన్నపేట, సెప్టెంబర్ 10 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేయూతనివ్వడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖాధికారి రాము అన్నారు. మంగళవారం ఆయన ఉన్నత పాఠశాలను సందర్శించి కిచెన్‌గార్డెన్‌ను పరిశీలించారు. రాము మాట్లాడుతూ 1984-85 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. పులిగిళ్ల శ్రీనివాస్ రూ.50 వేలు, గట్టు పద్మజ, పెద్ది గిరిజ (ఉమారాణి), పృథ్వీరాజు రూ.10 వేల చొప్పున అందించారని తెలిపారు. దీంతో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేశామన్నారు. టెన్త్‌లో విద్యార్థులు 10 జీపీఏ సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వందశాతం అటెండెన్స్ ఉన్న విద్యార్థులకు ఆయన బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్‌వో వెంకట్‌రెడ్డి, సైన్స్ టీచర్ యాదగిరి,హెచ్ఎం వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు గట్టు రామచంద్రం, బాలరాజు, యాదగిరి, మల్లారెడ్డి, నర్సింహారెడ్డి పద్మజ, లక్ష్మి పాల్గొన్నారు.

సంజయ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో టీచర్లు

ఘనంగా పోషణ మాసోత్సవాలు

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 10 : పట్టణంలోని నెహ్రూనగర్, సంజయ్ నగర్, ధర్మకంచ 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ నేతృత్వంలో మంగళవారం పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏసీడీపీవో వీ సత్యవతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. పిల్లలు, బాలింతలు, గర్భిణులు అన్నంతో పాటు ఆకుకూరలు ఆహారంగా తీసుకోవాలని సూచించారు. ఆరు నెలలు నిండిన పిల్లలకు అనుబంధ ఆహారం ఇవ్వాలని సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీ పూర్ణిమ, అంగన్‌వాడీ టీచర్లు ఎం రేణుక, ఆర్ జయ, ఈ భారతి, వై జ్యోత్స్న, ఆయాలు పీ విజయ, సీహెచ్ విజయ, బీ నర్సమ్మ, ఆర్ వరలక్ష్మి పాల్గొన్నారు.

108 బంగారు పద్మాలతో పూజలు

చిల్పూరు, సెప్టెంబర్ 10 : మండల కేంద్రంలోని బుగులు వేంకటేశ్వరస్వామి వారికి మంగళవారం అష్టాదశ పాద పద్మారాధన పూజలు చేశారు. తిరుపతిలో జరిగినట్లు 108 బంగారు పుష్పాలతో పూజ నిర్వహించారు. అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసినట్లు ఆలయ ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి ఈవో ఎస్ మోహన్‌బాబు, ఆలయ మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు-కిరణ్మయి దంపతులు, దేవస్థానం మాజీ డైరెక్టర్ సంగోజు మోహన్‌చారి-శంకరలక్ష్మీ దంపతులు, అర్చకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట ముగ్గురి బైండోవర్

బెల్టు షాపు నిర్వాహకులను బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 10 : మండలంలోని నమిలిగొండలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులను నిర్వహిస్తున్న ముగ్గురిని తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నమిలిగొండలో తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు మద్యం అమ్ముతున్నారని ఆయన వివరించారు. ప్రభుత్వ పాఠశాల సమీపంలో, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో బెల్టు షాపులు నిర్వహించడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఐ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బెల్టు షాపులపై దాడులు నిర్వహించి సుమారు రూ.25 వేల విలువైన బీర్లు స్వాదీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. రజిత, రమ, ఎల్లయ్యను బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై జనార్దన్, హెడ్ కానిస్టేబుల్ సంజీవ, సిబ్బంది వెంకన్న, రవీందర్ పాల్గొన్నట్లు సీఐ తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి దవాఖానకు తరలింపు

చిల్పూరు, సెప్టెంబర్ 10 : మండలంలోని నష్కల్ గ్రామానికి చెందిన వడ్లకొండ యాదగిరి చిన్న కుమారుడు వడ్లకొండ తిరుపతి(36)కి రెండేళ్లుగా మతిస్థిమితం సరిగా లేదు. హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానలో వైద్యం చేయించినప్పటికీ అతని పరిస్థితి కుదుటపడలేదు. గతం మాదిరిగానే ఇంట్లో వాళ్లతోపాటు రోడ్డుపై వెళ్లే వాళ్లను సైతం రాళ్లతో కొట్టడం లాంటివి చేస్తున్నాడు.

అతని ప్రవర్తనను భరించలేక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతిని హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించం : ఎమ్మెల్యే కడియం

స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 10 : నియోజకవర్గ అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదని, నిర్లక్ష్యాన్ని సైతం సహించేది లేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో నియోజకవర్గ పరిధిలో చేపట్టిన, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కడియం మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పని చేస్తూ అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గత నాలుగేళ్లుగా స్టేషన్‌ఘనపూర్‌లో రోడ్ల వైడ్నింగ్, కాజ్‌వేల నిర్మాణం సరిగ్గా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రూ.150 కోట్లతో నియోజకవర్గంలో రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు శ్రీహరి తెలిపారు. ఈ నెల చివరి నాటికి మంజూరైన పనులను ప్రారంభిస్తామన్నారు. సీసీఆర్ కింద రూ.100 కోట్లతో, ఎంఆర్ఆర్‌లో రూ.30 కోట్లతో, ఎస్‌సీపీ కింద రూ.20 కోట్లతో పనులు ప్రారంభించబోతున్నామని వివరించారు. ఎనిమిది నెలల్లో పనులు పూర్తి చేసి మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. వరదల కారణంగా దెబ్బతిన్న రోడ్లను

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం

త్వరితగతిన మరమ్మతు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో జరుగుతున్న పనులను మొదటి ప్రాధాన్యతలో తీసుకొని వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న స్థానాల్లో త్వరలో నూతన ఏఈలను నియమిస్తామన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఈ కే రఘువీరారెడ్డి, ఈఈలు శ్రీనివాస్ రావు, శంకరయ్య, డీఈలు రవీందర్, శిరీష, శ్రీనివాస్, డీపీవో స్వరూపారాణి, ఆర్డీవో డీఎస్ వెంకన్న, ఎంపీడీవో విజయశ్రీ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

తొలి ప్రైవేట్ స్పేస్‌వాక్

నలుగురు వ్యోమగాములను నింగిలోకి పంపిన 'స్పేస్ ఎక్స్'

కేప్ కెనావెరల్, సెప్టెంబర్ 10: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన ఖగోళ పరిశోధనా సంస్థ 'స్పేస్ ఎక్స్' సరికొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైంది. అంతరిక్షంలో తొలిసారి ప్రైవేట్ స్పేస్‌వాక్ నిర్వహించేందుకు 'పొలారిస్ డాన్' ప్రాజెక్టులో భాగంగా నలుగురు వ్యోమగాములను 'ఫాల్కన్-9' రాకెట్ ద్వారా రోదసిలోకి పంపింది. ప్రముఖ బిలియనీర్ జేర్డ్ ఇసాక్‌మన్, 'స్పేస్ ఎక్స్' ఇంజినీర్లు సారా గిల్లీ, అన్నా మెనోన్, అమెరికా వైమానికదళ మాజీ పైలట్ స్కాట్ కిడ్‌తో కూడిన ఈ రాకెట్ మంగళవారం తెల్లవారుజామున ఫ్లోరిడాలోని కెనడీ స్పేస్ సెంటర్ నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. 'పొలారిస్' ప్రాజెక్టులో చేపట్టే మూడు మానవసహిత రోదసి యాత్రల్లో ఇదే మొదటిది. ఈ యాత్ర అనుకున్నట్టుగా సాగితే బుధవారం లేదా గురువారం వారు స్పేస్‌వాక్ నిర్వహిస్తారు.

మహారాష్ట్రలో ఎన్నికల వేడి

- దీపావళి తర్వాత ఎన్నికలకు అవకాశం
- కసరత్తు ప్రారంభించిన ఎన్నికల సంఘం
- మహాయుతి వర్సెస్ మహా వికాస్ అఘాడీ
- రెండు కూటముల మధ్య హోరాహోరీ
- తేలనున్న శివసేన, ఎన్సీపీ భవిష్యత్తు
- సర్వేల్లో మహా వికాస్ అఘాడీకి మొగ్గు

ముంబై, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల హీట్ మొదలైంది. దీపావళి తర్వాత రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఈ నెల 13న జిల్లాల కలెక్టర్లతో ఈసీ సమీక్ష నిర్వహించనుంది. కాగా, అధికారాన్ని కాపాడుకోవాలనే లక్ష్యంతో బీజేపీ, శివసేన(షిండే), ఎన్సీపీ(అజిత్)తో కూడిన మహాయుతి కూటమి ఎన్నికల బరిలో దిగుతున్నది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన జోష్‌ను కొనసాగించి రాష్ట్రంలో అధికారం దక్కించుకునేందుకు కాంగ్రెస్, శివసేన(ఠాక్రే), ఎన్సీపీ(శరద్ పవార్)తో కూడిన మహా వికాస్ అఘాడీ ప్రయత్నిస్తున్నది. దీంతో రెండు కూటముల మధ్య హోరాహోరీ పోరు నెలకొన్నది. ఈ ఎన్నికలు రాష్ట్రంలో అధికారం ఎవరిదో నిర్ణయించడంతో పాటు శివసేన, ఎన్సీపీల భవిష్యత్తును కూడా తేల్చేయనున్నాయి. ఈ నేపథ్యంలో రెండు కూటములకు ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి.

ఏ ప్రాంతంలో ఎవరిది హవా?

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పటికే సర్వేల జోరు మొదలయ్యింది. అయితే, పలు ప్రాంతాల్లో మహాయుతి, ఇంకొన్ని ప్రాంతాల్లో మహా వికాస్ అఘాడీకి సానుకూలత ఉన్నట్టు సర్వేలు చెప్తున్నాయి. విదర్భలోని 62 సీట్లలో మహా వికాస్ అఘాడీ అధిపత్యం ఉంటుందని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. ఖాందేష్‌లోని 47 సీట్లలో రెండు కూటములకు సమానంగా విజయావకాశాలు ఉన్నాయని విశ్లేషిస్తున్నారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కంచుకోట అయిన ఠాణేతో పాటు కొంకణ్ బెల్ట్‌లోని 39 సీట్లలో మాత్రం మహాయుతి కూటమికి మొగ్గు కనిపిస్తున్నట్టు చెప్తున్నారు. ఠాణేలో షిండే వైపు నిలుస్తున్న మరాఠా ఓటర్లు ముంబైలో మాత్రం ఉద్ధవ్ ఠాక్రేకు అనుకూలంగా ఉన్నారని, ముంబై బెల్ట్‌లోని 36 నియోజకవర్గాల్లో మహాయుతిపై మహా వికాస్ అఘాడీకి స్పష్టమైన ఆధిక్యం కనిపిస్తున్నట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పవార్ కుటుంబానికి పట్టున్న పశ్చిమ మహారాష్ట్రలోని 58 సీట్లతో పాటు, మరాఠ్వాడాలోని 46 స్థానాల్లో మహా వికాస్ అఘాడీకి సానుకూలత ఉన్నట్టు చెప్తున్నారు. మహాయుతి కంటే మహా వికాస్ అఘాడీకే రాష్ట్రంలో మొగ్గు కనిపిస్తున్నదని లోక్ పోల్ సర్వే పేర్కొన్నది.

లోక్‌సభ ఫలితాలు రిపీట్ అవుతాయా?

మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల్లో మహాయుతి కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కూటమి కేవలం 17 సీట్లతో సరిపెట్టుకోగా, మహా వికాస్ అఘాడీ 30 సీట్లు గెలుచుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత, శాంతిభద్రతలు దెబ్బతినడం, అధిక ధరలు, ఛత్రపతి శివాజీ విగ్రహం కూలడం, మరాఠాల రిజర్వేషన్ల ఉద్యమం, నిరుద్యోగం, మహారాష్ట్ర నుంచి పలు ప్రాజెక్టులు గుజరాత్‌కు వెళ్లిపోవడం వంటి అంశాలు మహాయుతి కూటమికి వ్యతిరేకంగా మారాయి. మరోవైపు మూడు పార్టీల మధ్య సమన్వయలేమి, సీట్ల పంపకాలు, సీఎం అభ్యర్థిత్వంపై నిర్ణయం తీసుకోలేకపోవడం వంటి అంశాలు మహా వికాస్ అఘాడీకి ప్రతికూలంగా ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కేదార్‌నాథ్ మార్గంలో విరిగిన కొండచరియలు ఐదుగురి మృతి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: కేదార్‌నాథ్ వెళ్లే మార్గంలో భారీ వర్షాల కారణంగా పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడగా, ఐదుగురు యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం రాత్రి కేదార్‌నాథ్ జాతీయ రహదారిపై సోన్‌ప్రయాగ, గౌరీకుండ్ మధ్య ఈ ఘటన చోటుచేసుకున్నది. కేంద్ర, రాష్ట్ర విపత్తు సహాయక బృందాలు అక్కడికి చేరుకొని, ఘటనాస్థలం నుంచి ఐదు మృతదేహాల్ని వెలికితీసినట్టు రుద్రప్రయాగ్ విపత్తు నిర్వహణ అధికారి నందన్ సింగ్ రాజ్వార్ చెప్పారు. శిథిలాల కింద మరికొంత మంది యాత్రికులు చిక్కుకుపోయి ఉండొచ్చునని పోలీసులు తెలిపారు. జమ్ముకశ్మీర్‌లో వైష్ణో దేవి ఆలయాన్ని చేరుకునేందుకు కొత్తగా ఏర్పాటుచేసిన మార్గంలో సోమవారం కొండచరియలు విరిగిపడి ఇద్దరు మహిళా యాత్రికులు చనిపోయారు.

5 వేల సైబర్ కమెండోలు.. ఆన్‌లైన్ రిజిస్ట్రీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: సైబర్ భద్రతను మరింత పటిష్ఠం చేయడం కోసం కేంద్రం కీలక చర్యలు ప్రకటించింది. 5 వేల మంది సైబర్ కమెండోల నియామకం, వెబ్ ఆధారిత డాటా రిజిస్ట్రీ, సైబర్ నేరాల సమాచారం పంచుకొనే పోర్టల్, జాతీయ అనుమానితుల రిజిస్ట్రీని ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. సైబర్ నేరాలకు హద్దులు లేవని.. సైబర్ భద్రత లేకుండా జాతీయ భద్రత అసాధ్యమని అన్నారు. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన భారత సైబర్ నేరాల సహకార కేంద్రం(ఐ4సి) మొదటి వ్యవస్థాపక దినోత్సవంలో అమిత్ షా ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్రాలకు సంబంధించిన సంబంధిత సంస్థల ప్రతినిధులతో సైబర్ నేరాల తగ్గింపు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

మహిళా అధికారిపై వింగ్ కమాండర్ లైంగిక దాడి!

- కేసు నమోదు చేసిన పోలీసులు
- విచారణకు ఆదేశించిన ఐఏఎఫ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: భారత వైమానిక దళంలోని ఉన్నత అధికారిపై అత్యాచారం ఆరోపణలు జమ్ముకశ్మీర్‌లో సంచలనం సృష్టించాయి. జమ్ముకశ్మీర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ వింగ్ కమాండర్ తనపై లైంగిక దాడి చేయడమే కాక, మానసికంగా వేధిస్తున్నాడని మహిళా ఫ్లయింగ్ అధికారి ఆరోపించారు. ఆమె ఫిర్యాదు మేరకు ఐఏఎఫ్ అంతర్గత విచారణకు ఆదేశించింది. జమ్ముకశ్మీర్‌లోని బుద్గాం పోలీసు స్టేషన్‌లో వింగ్ కమాండర్‌పై కేసు నమోదు చేశారు. బాధితురాలి కథనం ప్రకారం ఈ ఘటన 2023, డిసెంబర్ 31న న్యూఇయర్ వేడుకల్లో జరిగింది. ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగిన పార్టీలో ఆ అధికారి తన గదిలో లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధితురాలు ఆరోపించారు.

తోడేళ్ల భరతం పడుతున్నారు

ఉత్తర ప్రదేశ్‌లోని భరూచ్‌లో మనుషుల ప్రాణాలను హరిస్తున్న తోడేళ్ల వేట కొనసాగుతున్నది. అటవీ శాఖ అధికారులు స్థానికుల సహాయంతో మంగళవారం వలపన్ని ఒక తోడేలును ఇలా బంధించారు. మిగతా వాటి కోసం వేట కొనసాగుతోంది.

'సిద్ధ' ఔషధాలతో బాలికల్లో రక్తహీనత తగ్గుదల

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: కొన్ని 'సిద్ధ' ఔషధాల కాంబినేషన్‌తో కిశోర బాలికల్లో రక్తహీనతను తగ్గిస్తుందని తాజా అధ్యయనం వెల్లడించింది. ఇండియన్ జర్నల్ ఆఫ్ ట్రెడిషనల్ నాలెడ్జ్‌లో ఇది ప్రచురితమైంది. కేంద్ర ఆయుష్ శాఖ ప్రకటన ప్రకారం.. ఏబీఎంఎన్(అన్నపెటిక్‌సెంచురమ్, బావన కటుక్కాయ్, మతులై మనప్పకు, నెల్లికాయ్ లేహ్యం) మిశ్రమంతో కూడిన సిద్ధ ఔషధం హిమోగ్లోబిన్ స్థాయిలను, రక్త కణాల శాతాన్ని పెంచుతుందని కనుగొన్నారు. శరీరంలో నులి పురుగులు తొలగించిన 2300 కిశోర బాలికలపై 45 రోజులపాటు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఈ బాలికల్లో రక్త హీనత లక్షణాలైన అయాసం, జుట్టు ఊడిపోవడం, తల నొప్పి, రుతుక్రమ అసమతుల్యత తగ్గినట్టు కనుగొన్నారు. జాతీయ సిద్ధ సంస్థ, తమిళనాడులోని గ్జేవియర్ రిసెర్చ్ ఫౌండేషన్, వెలుమైలు సిద్ధ వైద్య కళాశాల, దవాఖాన తదితర సంస్థలు ఈ అధ్యయనంలో పాల్గొన్నాయి.

సమాన అవకాశాలు ఉంటే

రిజర్వేషన్లు రద్దు

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ వ్యాఖ్య

వాషింగ్టన్, సెప్టెంబర్ 10: అందరికీ సమానమైన అవకాశాలు ఉన్నప్పుడు రిజర్వేషన్లు రద్దు చేయడం గురించి ఆలోచిస్తామని, ఇప్పుడు భారత్‌లో అందరికీ సమాన అవకాశాలు లేవని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా వాషింగ్టన్‌లోని జార్జ్‌టౌన్ యూనివర్సిటీ విద్యార్థులతో ఆయన మాట్లాడారు. దేశంలో ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల జనాభా 90 శాతం ఉందని, కానీ దేశంలోని మొదటి 200 వ్యాపారుల్లో, అత్యున్నత న్యాయస్థానాల్లో, మీడియాలో వీరి భాగస్వామ్యం దాదాపు శూన్యమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంలో 78 మంది కార్యదర్శులు ఉంటే వీరిలో ఒకే ఒక్క గిరిజనుడు, ముగ్గురు దళితులు, ముగ్గురు ఓబీసీలు, ఒక్క మైనారిటీ మాత్రమే ఉన్నారని అన్నారు. కులగణన ద్వారానే దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల స్థితిగతులు తెలుస్తాయని పేర్కొన్నారు.

రాహుల్ వ్యాఖ్యలపై వివాదం

వర్జీనియాలో భారత సంతతి ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు వివాదంగా మారాయి. 'ఇవాళ భారత్‌లో పోరాటం రాజకీయాల కోసం కాదు. ఒక సిక్కు టర్బన్ ధరించి, గురుద్వారాకు వెళ్లడానికి అనుమతిస్తారా అనే దానిపై పోరాటం జరుగుతున్నది. అన్ని మతాల కోసం జరుగుతున్న పోరాటం ఇది' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను కేంద్రమంత్రి హర్‌దీప్ సింగ్ పురి తప్పుబట్టారు. రాహుల్ మాట్లాడిన భాష ఖలిస్థానీ వేర్పాటువాది గురుత్వంత్ సింగ్ పన్నూ భాషను పోలి ఉందని ఆయన ఆరోపించారు.

సుప్రీం ఆదేశాలను ధిక్కరించి..!

- నిరసనలు కొనసాగిస్తున్న కోల్‌కతా జూనియర్ డాక్టర్లు
- చర్చలకు రావాలంటూ సీఎం మమతా బెనర్జీ ఆహ్వానం

కోల్‌కతాలో స్వాస్థ్య భవన్ వైపు నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు

కోల్‌కతా, సెప్టెంబర్ 10: కో